ఘనంగా వారాహి నవరాత్రి ఉత్సవాలు



రాయదుర్గం: వారాహి నవరాత్రులను పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నపూర్ణాదేవి, గణపతి, కాశీవిశ్వేశ్వరస్వామి, షిర్డీసాయిబాబా, ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ సంయుక్త కార్యదర్శిగా అతీక్‌ అహ్మద్‌



రాయదుర్గం: స్టూడెంట్స్‌ ఫెడరేషన్‌ ఆఫ్‌ ఇండియా(ఎస్‌ఎఫ్‌ఐ) జాతీయ సంయుక్త(జాయింట్‌) సెక్రెటరీగా ఎండీ అతీక్‌ అహ్మద్‌ నియామకం అయ్యారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీలో ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్షుడిగా పనిచేయగా, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కూడా విధులు నిర్వర్తిస్తున్న తరుణంలో జాతీయ స్థాయిలో జాయింట్‌ సెక్రెటరీగా నియామకం కావడం విశేషం.

డబుల్‌ ఇళ్ల కోసం స్థలాల పరిశీలన



డబుల్‌ బెడ్‌ రూం ఇళ్ల స్థలాలను పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ అధికారులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలో డబుల్‌ బెడ్‌ రూం ఇళ్ల నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ అధికారులు సోమవారం కేశవనగర్‌, పాపిరెడ్డినగర్‌, గోపీనగర్‌లలో పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో డబుల్‌ బెడ్‌ రూం ఇళ్ల నిర్మాణానికి అనువైన స్థలం కోసం అధికారుల బృందం పర్యటించారు. శేరిలింగంపల్లి సర్కిల్‌ ప్రాజెక్టు ఆఫీసర్‌ మల్లీశ్వరీ, ఏసీపీ వెంకటరమణ, జీహెచ్‌ఎంసీ హౌసింగ్‌ ఏఈ వెంకటేశ్వర్‌రావు, రంగారెడ్డి జిల్లా హౌసింగ్‌ ఏఈ లావణ్య, శేరిలింగంపల్లి ఆర్‌ఐ చంద్రారెడ్డి స్థలాలను పరిశీలించిన వారిలో ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని భాగ్యనగర్‌కాలనీ రెసిడెంట్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ నూతన కార్యవర్గ సభ్యులు పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని ఆయన నివాసంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని శాలువాతో సన్మానించి, అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధికి తనవంతూ సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో చాపరాల శ్రీనివాస్‌ దాసు, భాగ్యనగర్‌ కాలనీ రెసిడెంట్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు సైదేశ్వర రావు, వైస్‌ ప్రెసిడెంట్లు చంద్రమౌళి, అంజనా, శ్రీనివాసగౌడ్‌, సత్యనారాయణ, జనరల్‌ సెక్రటరీ రామలింగేశ్వరరావు, జాయింట్‌ సెక్రటరీలు అనిల్‌కుమార్‌, ఈశ్వర్‌, నిఖిల్‌, వెంకారెడ్డి, వినయ్‌, రాజా, ట్రెజరర్‌ రాజేంద్ర ప్రసాద్‌, అసిస్టెంట్‌ బి.వి. రెడ్డి, ఆర్గనైజింగ్‌ సెక్రటరీ బ్రహ్మానంద రెడ్డి, స్పోర్ట్స్‌ సెక్రటరీ జనార్దన్‌, కల్చరల్‌ సెక్రెటరీ అశోక్‌రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ముష్కి చెరువును కాపాడండి

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు స్థానికుల వినతి

మణికొండ: గతంలో ఎప్పుడూ లేనివిధంగా అపార్ట్‌మెంట్ల మురుగు నీటిని చెరువులో కలిపి స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్న చుట్టుపక్కల ధృవాన్ష్‌ సంస్థ కార్యకలాపాలను వెంటనే నిలిపివేయించాలని మైహోం అవతార్‌, హాల్‌మార్క్‌ వినిసియా నివాసితులు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను సోమవారం కోరారు. గుడికి వచ్చే భక్తులు సైతం ఇబ్బందులు పడుతున్నట్లు వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా నివాసితుడు గౌతంరెడ్డి మాట్లాడుతూ గతంలో చెరువులో వరద నీరు మాత్రమే ఉండేదని, ఇప్పుడు మురుగు నీరు కలుస్తుండటంతో చుట్టుపక్కల నివసించలేని దుస్థితి ఎదురవుతోందన్నారు. వెంటనే ధృవాన్ష్‌ సంస్థ పనులను నిలిపివేసి అక్కడి నుంచి పంపాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామన్నారు. స్పందించిన ఎమ్మెల్యే నార్సింగి, మణికొండ మున్సిపల్‌ కమిషనర్లు త్వరలోనే హెచ్‌ఎండీఏ అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్‌ కె.రామకృష్ణారెడ్డి, నాయకుడు శ్రావణ్‌కుమార్‌తో పాటు నివాసితులు పాల్గొన్నారు.

వర్షం వస్తే ముంపే!



జనప్రియ అపార్ట్‌మెంట్స్‌ వద్ద నాలా వరద వెళ్లకుండా అడ్డంగా ప్రహరీ

నాలా విస్తరణలో జాప్యమెందుకు..?

- ప్రతి ఏటా వరద ముంపులో జనప్రియనగర్‌
- శాశ్వత పరిష్కారం జరిగేనా?
- అధికారుల నిర్లక్ష్యంతో నిలిచిన విస్తరణ పనులు

చందానగర్‌: హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధిలోని కాయిదమ్మకుంట చెరువు నుంచి గురునాథం చెరువు వరకు నాలా ద్వారా వరద, మురుగు వెళ్తోంది. కాయిదమ్మకుంట నుంచి జనప్రియనగర్‌ వరకు ప్రత్యేక నిధుల ద్వారా నాలా విస్తరణ చేశారు. జనప్రియనగర్‌, జనప్రియ అపార్ట్‌మెంట్స్‌ 1, 4 డాల్ఫిన్‌ టవర్స్‌ మీదుగా సీతార హోటల్‌ జాతీయ రహదారి నుంచి గురునాథం చెరువులోకి కలుస్తుంది. అయితే కాలనీలకు మధ్యలో నాలా కుచించుకుపోయింది. జనప్రియనగర్‌కు ఆనుకొని ఉన్న హేమదుర్గ అపార్ట్‌మెంట్స్‌లో నాలాపైనే పార్కులను నిర్మించారు. ఏకంగా అపార్ట్‌మెంట్స్‌ చుట్టూ ప్రహరి గోడ నిర్మించుకొని లోపలకు ఎవరూ రాకుండా సెక్యూరిటీని ఏర్పాటు చేసుకున్నారు. ఎప్పుడైనా వరదలు వస్తే వరద నీటిలో మునగాల్సిందేనా అని జనప్రియవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది వచ్చిన వరదలకు నాలాలోకి వరద జనప్రియ అపార్ట్‌మెంట్స్‌ ఫేజ్‌–5లోని ఇళ్లలోకి చేరడంతో తీవ్ర ఆస్తినష్టం కలిగింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నాలా వెడల్పును పరిశీలించి వరద ముంపు నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

- దాదాపు రూ.8 కోట్లతో నాలా విస్తరణ నిర్మాణం కోసం నిధులు కేటాయించారు. కానీ సగం వరకు నాలా పనులు పూర్తయ్యాయి.
- కాయిదమ్మకుంట నుంచి జనప్రియనగర్‌ మీదుగా జనప్రియ అపార్ట్‌మెంట్‌ ఫేజ్‌–1 వరకు నాలా పనులు పూర్తి చేశారు. కానీ అక్కడి నుంచి హేమదుర్గ అపార్ట్‌మెంట్‌ నుంచి ముందుకు సాగలేదు.
- హేమదుర్గ అపార్ట్‌మెంట్స్‌లో నుంచి వెళ్లిన నాలా జాతీయ రహదారి సీతార హోటల్‌ వద్ద చిన్న పైపుల ద్వారా బయటకు వెళ్లేలా చేశారు.
- వర్షాకాలం సమయంలో హేమదుర్గ అపార్ట్‌మెంట్స్‌తో పాటు జనప్రియ అపార్ట్‌మెంట్స్‌ వరద భయం ముంగిట ఉంటుంది.
- వర్షాకాలంలో నాలా చుట్టుపక్కల ఉన్న కాలనీలు, అపార్ట్‌మెంట్‌వాసులకు దోమల బెడద తీవ్రంగా ఉంది. దీంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు.
- ప్రజాప్రతినిధులు, అధికారులకు కాలనీ అసోసియేషన్‌ సభ్యులు విన్నవించినా పనులు పూర్తి కావడం లేదని, కాంట్రాక్టర్‌ నిర్లక్ష్యమా.. లేక అధికారుల నిర్లక్ష్యమా అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



జాతీయ రహదారి వద్ద ఉన్న పైప్‌లైన్‌ నుంచి జనప్రియ అపార్ట్‌మెంట్స్‌ వద్దకు వస్తున్న వరద



నాలాకు అడ్డంగా నిర్మించిన ప్రహరీతో పాటు అపార్ట్‌మెంట్‌, పార్కు

అధికారుల నిర్లక్ష్యంతోనే..



నాలాకు ఇరు వైపులా అపార్ట్‌మెంట్ల నిర్మాణం జరిగింది. వరదలు వచ్చినప్పుడు నాలా వల్ల జనప్రియనగర్‌, అపార్ట్‌మెంట్స్‌ పూర్తిగా ముంపునకు గురవుతోంది. నిధులు ఉన్నా నాలా పనులు ముందుకు సాగడం లేదు. ఇది కేవలం అధికారుల నిర్లక్ష్యం వల్ల పనుల్లో అలసత్వం వహిస్తున్నారు.

– వెంకటసుబ్బయ్య, జనప్రియనగర్‌

ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలి



నాలా విస్తరణ పనుల్లో భాగంగా హేమదుర్గ అపార్ట్‌మెంట్‌ నుంచి జాతీయ రహదారి వరకు అసంపూర్తిగా ఉన్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదు. ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ ప్రత్యేక దృష్టి సారించి నాలా విస్తరణ పనులు ప్రారంభమయ్యే విధంగా అధికారులకు ఆదేశించాలి. నాలా విస్తరణ పనులు వేగంగా పూర్తి చేసి స్థానికులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి.

– పునారాం చౌదరి, జనప్రియ అపార్ట్‌మెంట్‌

ప్రజావాణిలో 5 ఫిర్యాదులు

చందానగర్‌: చందానగర్‌ సర్కిల్‌–21 కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 5 ఫిర్యాదులు వచ్చాయని ఉపకమిషనర్‌ మోహన్‌రెడ్డి తెలిపారు. టౌన్‌ప్లానింగ్‌ 1, ఇంజనీరింగ్‌ విభాగానికి 4 ఫిర్యాదులు వచ్చాయి. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు డీసీ మోహన్‌రెడ్డి ఆదేశించారు. కార్యక్రమంలో ఏసీపీ నాగిరెడ్డి, ఇంజినీరింగ్‌, శానిటేషన్‌, యూబీడీ అధికారులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన పోలీసులు



ఉద్యోగ విరమణ చేసిన వారితో కమాండెంట్‌ రామకృష్ణ

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో పనిచేసిన రిజర్వ్‌ ఇన్‌స్పెక్టర్‌ ఎన్‌.పోచప్ప, ఏఆర్‌ఎస్‌ఐ సత్యప్రసాద్‌ ఉద్యోగ విరమణ చేశారు. వీరిని బెటాలియన్‌ కమాండెంట్‌ ఎం.రామకృష్ణ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసిన వారు సంతృప్తికరమైన జీవితాన్ని కుటుంబంతో గడపాలని సమాజసేవలో భాగం కావాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కమాండెంట్‌ బీవీరెడ్డి, అసిస్టెంట్‌ కమాండెంట్లు బి.సీతారాం, ఎస్‌.రాంబాబు, ఎం.నాగభూషణం, ఎం.పార్థసారథిరెడ్డి, బెటాలియన్‌ సిబ్బంది ఉద్యోగవిరమణ చేసిన వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలి



శేరిలింగంపల్లి జోన్‌లో పర్యటిస్తున్న మేయర్‌ విజయలక్ష్మి, అధికారులు

గచ్చిబౌలి: జంక్షన్ల అభివృద్ధి యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని నగర మేయర్‌ గద్వాల్‌ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. శేరిలింగంపల్లి జోన్‌లోని పలు అభివృద్ధి కార్యక్రమాలను సోమవారం ఆమె పరిశీలించారు. జంక్షన్‌ అభివృద్ధిలో 11 ఆస్తులు కోల్పోతున్న వారితో మాట్లాడి సాయంత్రం వరకు నివేదిక ఇవ్వాలని జోనల్‌ కమిషనర్‌ను ఆమె ఆదేశించారు. అవసరమైతే స్టాండింగ్‌ కమిటీలో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మశంకర్‌నగర్‌లో ఓపెన్‌జిమ్‌, మల్టీపర్పస్‌ ఫంక్షన్‌ హాల్‌ నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేసిన ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. మూడు అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి పిల్లలకు అందిస్తున్న పోషకాహారం వివరాలను తెలుసుకొని పిల్లలను అడిగారు. మరో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని బస్తీవాసులు మేయర్‌ను కోరగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యూసుఫ్‌గూడ ట్రాన్స్‌ఫర్‌ స్టేషన్‌ను పరిశీలించి స్వచ్ఛ ఆటో డ్రైవర్లతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో రహమత్‌నగర్‌, బ్రహ్మశంకర్‌నగర్‌, యూసుఫ్‌గూడ ప్రదేశాలలో పర్యటించి పలు పనులను పరిశీలించారు. కార్పొరేటర్‌ సీఎన్‌రెడ్డి, జోనల్‌ కమిషనర్‌ హేమంత్‌ సహదేవ్‌ రావు, సీఈ సహదేవ్‌, రత్నాకర్‌, ఏసీ శానిటేషన్‌ రఘుప్రసాద్‌, ప్రాజెక్టు ఈఈ నూన్యనాసిక్‌, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి



వాటర్‌ వర్క్స్‌ జీఎం కృష్ణకు సమస్యలను వివరిస్తున్న కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌యాదవ్‌

శేరిలింగంపల్లి: తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని వాటర్‌ వర్క్స్‌ జీఎం కృష్ణను కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌యాదవ్‌ కోరారు. వాటర్‌ వర్క్స్‌ కార్యాలయంలో సోమవారం కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్‌ మాట్లాడుతూ బస్తీలు, కాలనీల్లో పొంగి పొరుతున్న డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వివిధ శాఖలను సమన్వయం చేసుకోవాలని కోరారు. పాపిరెడ్డినగర్‌, హెచ్‌ఏఎల్‌ కాలనీల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్‌ డీజీఎం నరేందర్‌రెడ్డి, మేనేజర్లు అభిషేక్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, పాపిరెడ్డినగర్‌ అధ్యక్షుడు బద్దం కొండల్‌రెడ్డి, నాయకులు రాంబాబు, లక్ష్మణ్‌, హెచ్‌ఏఎల్‌ కాలనీ ప్రెసిడెంట్‌ పరశురామ్‌ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి



వినతి పత్రం అందజేస్తున్న ఎంసీపీఐ(యూ) నాయకులు

శేరిలింగంపల్లి: అర్హులందరికీ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించాలని ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని సోమవారం అందజేశారు. ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా శేరిలింగంపల్లిలో కూడా చేపట్టినట్లు ఆ పార్టీ నాయకులు ఇస్లావత్‌ దశరథ్‌ నాయక్‌ తెలిపారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. అదేవిధంగా ఈ సీజన్‌లో తలెత్తే సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మురళి, శివాని, సుల్తానా బేగం, శ్రీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కి యువత బానిస కావొద్దు

ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి

పటాన్‌చెరు: ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రమశిక్షణ కీలకమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి అన్నారు. పటాన్‌చెరులో విద్యార్థుల సౌకర్యం కేజీ నుంచి పీజీ వరకు ప్రభుత్వ విద్యాసంస్థలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జూలై 15 నుంచి ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాల తరగతులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందించే నిధులతో పాటు నియోజకవర్గంలోని పరిశ్రమల సీఎస్‌ఆర్‌ నిధులతో ప్రభుత్వ విద్యాసంస్థల భవనాలు నిర్మిస్తున్నామని చెప్పారు. డివిజన్‌ పరిధిలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాల, డాక్టర్‌ ఏపీజే అబ్దుల్‌ కలాం డిగ్రీ కళాశాలలో గ్లాండ్‌ ఫార్మా పరిశ్రమ సహకారంతో నాలుగు కోట్ల రూపాయలు అంచనా వ్యయంతో నిర్మించిన 15 అదనపు తరగతి గదులను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్‌ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థలను తీర్చిదిద్దుతున్నామన్నారు. భవనాలతో పాటు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించనున్నట్లు చెప్పారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న డ్రగ్స్‌కి ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ మెట్టు కుమార్‌ యాదవ్‌, గ్రాండ్‌ ఫార్మా పరిశ్రమ సీఎస్‌ఆర్‌ హెడ్‌ రఘురామన్‌, పాల్గొన్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

మియాపూర్‌: బృందావన్‌ కాలనీ, సెవెన్‌హిల్స్‌, నందమూరినగర్‌, కేంద్రీయ విహార్‌ మరమ్మతుల కారణంగా విద్యుత్‌ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని ఏఈ రవిచంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నాగార్జున హోమ్స్‌, సెవెన్‌హిల్స్‌ అపార్ట్‌మెంట్స్‌, 10:30 నుంచి 11:15గంటల వరకు ఓలిస్టిక్‌ ఆస్పత్రి, నిజాంపేట్‌ మెయిన్‌ రోడ్డు, నందమూరినగర్‌, 11:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు కేంద్రీయ విహార్‌, రత్నదీప్‌ బ్యాక్‌సైడ్‌, క్రికెట్‌ గ్రౌండ్‌, అదేవిధంగా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సద్గురు అపార్ట్‌మెంట్స్‌, కొలన్‌ శ్రీనివాస్‌ రెడ్డి ప్రాంతం, బృందావన్‌ కాలనీ, హైదర్‌నగర్‌, మయూరినగర్‌ పార్క్‌, ఓల్డేజ్‌ హోమ్స్‌, మయూరినగర్‌ ప్రాంతాలలో కరెంటు సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు.

ట్రాక్టర్‌ డ్రైవర్‌ ఆత్మహత్య

గచ్చిబౌలి: ట్రాక్టర్‌ డ్రైవర్‌ ఆత్మహత్య చేసుకున్న ఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ శంకర్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి జిల్లా పానగల్‌ మండలం గోపాలపురం ప్రాంతానికి చెందిన కె.విజయ్‌(23) గోపన్‌పల్లిలో నిర్మాణ సంస్థలో ట్రాక్టర్‌ను అద్దెకు నడుపుతున్నాడు. ఎన్టీఆర్‌నగర్‌లోని జైశ్రీరామ్‌ మెన్స్‌ పీజీ హాస్టల్‌లో నివాసం ఉంటున్నాడు. రూమ్‌ నంబర్‌–23లో దుర్వాసన రావడంతో ఆదివారం రాత్రి 7 గంటలకు హాస్టల్‌ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తలుపులు తెరిచి చూడగా అతడు సీలింగ్‌ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



శేరిలింగంపల్లి: రైల్వే ప్లాట్‌ఫారంపై ఉన్న బేంచీ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో సోమవారం చోటు చేసుకుంది. నాంపల్లి జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపల్లి రైల్వే స్టేషన్‌లోని 6వ నంబర్‌ ప్లాట్‌ఫారంలో బేంచీ వద్ద గుర్తు తెలియని వ్యక్తి(50) కింద పడిపోయాడు. గమనించిన రైల్వే పోలీసులు వెంటనే 108కు సమాచారం అందించి, కొండాపూర్‌ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు ప్రకటించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

బీజేపీ సంక్షేమ పథకాలపై కరపత్రాల పంపిణీ

అత్తాపూర్‌: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలతో ప్రజలంతా అభివృద్ధి చెందుతున్నారని బీజేపీ అత్తాపూర్‌ డివిజన్‌ అధ్యక్షుడు సులిగే వెంకటేష్‌ అన్నారు. డివిజన్‌ పరిధిలోని పాండురంగానగర్‌లో ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్‌ మెంబర్‌ విజయ్‌కుమార్‌, జి.రాజు, పి.వెంకట్‌రెడ్డి, శశికాంత్‌శర్మ, విమల్‌శర్మ, నరేష్‌, ముఖేష్‌, వెంకటేష్‌, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ తర్వాత సమాజ సేవలో పాల్గొనాలి

సైబరాబాద్‌ సీపీ అవినాష్‌మహంతి



ఉద్యోగ విరమణ చేసిన పోలీసులను సన్మానిస్తున్న సీపీ అవినాష్‌మహంతి

రాయదుర్గం: శాంతిభద్రతలు కాపాడుతూ, వృత్తికి న్యాయం చేసి ఉద్యోగ విరమణ చేసిన వారు సమాజ సేవలో పాల్గొనాలని సైబరాబాద్‌ సీపీ అవినాష్‌ మహంతి సూచించారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్‌ కమిషనరేట్‌ పరిధిలో ఉద్యోగ విరమణ చేసిన 12 మంది పోలీసులు, అధికారులకు సీపీ చేతులమీదుగా సోమవారం కమిషనరేట్‌లో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కెరీర్‌ అంతటా వారి అంకితభావం, నిబద్ధతకు కృతజ్ఞతలు తెలపాల్సిందే అన్నారు. ఉద్యోగ విరమణ తర్వాత జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సంతృప్తికరంగా గడపాలన్నారు. సమాజానికి తమ అనుభవ సంపదను ఉపయోగించాలని సూచించారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన వారికి శాలువాలు, పూలమాలలతో సత్కరించి వారికి పెన్షన్‌ పత్రాలను అందజేశారు. సైబరాబాద్‌ జాయింట్‌ కమిషనర్‌(ట్రాఫిక్‌) డాక్టర్‌ గజరావు భూపాల్‌ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్‌బీ డీసీపీ సాయిశ్రీ, సీఏఆర్‌ హెడ్‌క్వార్టర్స్‌ డీసీపీ సంజీవ, ఏడీసీపీ హనుమంతరావు, ఏసీపీ అరుణ్‌, అడ్మిన్‌ ఏడీసీపీ రవిచందన్‌రెడ్డి, మాదాపూర్‌ ఎస్‌బీ ఏడీసీపీ రవికుమార్‌, ఏడీసీపీ ఎస్‌బీ మేడ్చల్‌ ఎఫ్‌ రహమాన్‌, ఎస్‌బీ ఏసీపీ బి.ప్రకాశ్‌, సీఏఓ వెంకట్‌రెడ్డి తదితరులు ఉద్యోగ విరమణ చేశారు.

దేశంలో అతిపెద్ద ఇంక్యుబేషన్‌గా ‘ఎస్పైర్‌ బయోనెస్ట్‌’

సెంట్రల్‌ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్‌ ప్రొఫెసర్‌ బీజేరావు



డాక్టర్‌ వినయ్‌కి అవార్డు అందజేస్తున్న వీసీ ప్రొఫెసర్‌ బీజేరావు

రాయదుర్గం: దేశంలో అతిపెద్ద, అత్యంత అభివృద్ధి చెందుతున్న ఇంక్యుబేషన్‌ పర్యావరణ వ్యవస్థలలో ఎస్పైర్‌–బయోనెస్ట్‌ ఇంక్యుబేషన్‌ ఒకటని సెంట్రల్‌ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్‌ ప్రొఫెసర్‌ బీజేరావు స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలోని ఇన్నోవేషన్‌, ఇంక్యుబేసన్‌ విభాగం ఎస్పైర్‌ (అసోసియేషన్‌ ఫర్‌ సైంటిఫిక్‌ పర్స్యూట్స్‌ ఫర్‌ ఇన్నోవేటివ్‌ రీసెర్చ్‌ ఎంటర్‌ప్రైజెస్‌) దాని ప్రతిష్టాత్మక ప్రీ ఇంక్యుబేషన్‌ ప్రోగ్రామ్‌ మూడవ సైకిల్‌ విజేతలను సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా విజేతలకు వైస్‌చాన్స్‌లర్‌ ద్వారా అధికారికంగా అవార్డు, లేఖలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌సీయూలోని ఎస్పైర్‌ బయోనెస్ట్‌ ఇంక్యుబేషన్‌ అనేది విశ్వవిద్యాలయ ఆధారిత ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థలలో ఇది ఉత్తమమైనదిగా గుర్తింపు సాధించిందన్నారు. వినూత్న ఆలోచనలు చేసే విద్యార్థులు, ప్రారంభ దశలో ఉన్న వ్యవస్థాపకులను ప్రోత్సహించడానికి పూర్తిగా కట్టుబడి ఉన్నామన్నారు. కార్యక్రమంలో ఎస్పైర్‌ బయోనెస్ట్‌ సీఈఓ అనీల్‌కొండ్రెడ్డి, ఇతర అధికారులు, ప్రొఫెసర్లు, ఆవిష్కర్తలు పాల్గొన్నారు.

ఘనంగా హెచ్‌ఎం గ్రేస్‌ ఏంజలీనా వీడ్కోలు సభ



జ్ఞాపికను అందజేస్తున్న సహచర ఉపాధ్యాయులు

జిన్నారం (పటాన్‌చెరు): ఉమ్మడి జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో 28 సంవత్సరాల పాటు సేవలందించిన చెట్ల పోతారం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం గ్రేస్‌ ఏంజలీనా సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో మండల ఇన్‌చార్జి ఈఓ కుమార స్వామి పాల్గొని మాట్లాడారు. విద్యారంగంలో నాణ్యమైన విద్యను అందిస్తూ.. అంకితభావంతో ఏంజలీనా పని చేశారని కొనియాడారు. ఎంతోమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి ఉన్నత స్థానాల్లో నిలిపిన గొప్ప మార్గదర్శకులు అన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓతో కలిసి గ్రామ మాజీ సర్పంచ్‌ పులిగిల్ల ప్రకాశంచారి హెచ్‌ఎం గ్రేస్‌ ఏంజలీనా దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు



కార్మికుడిని ఓదారుస్తున్న చుక్కా రాములు

పటాన్‌చెరు టౌన్‌: కార్మిక శాఖ, ఫ్యాక్టరీస్‌ ఆఫ్‌ ఇన్‌స్పెక్టర్స్‌ పర్యవేక్షణ లేక.. నిర్లక్ష్యం వల్లనే పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు అన్నారు. పాశమైలారం పారిశ్రామికవాడ సిగాచి పరిశ్రమలో అగ్ని ప్రమాదం జరిగిన స్థలాన్ని ఆయన పరిశీలించి, క్షతగాత్రులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చనిపోయిన కుటుంబాలకు కోటి పరిహారం ఇవ్వడంతో పాటు గాయాల పాలైన వారికి తగిన ఎక్స్‌గ్రేషియా, మెరుగైన వైద్యం అందించాలన్నారు. పరిశ్రమల యజమానుల లాభాపేక్షతోనే రియాక్టర్లు పేలుతున్నాయన్నారు. అన్‌స్కిల్డ్‌ వర్కర్లతో రియాక్టర్ల వద్ద పని చేయించడం సరికాదన్నారు. ప్రమాదాలపై సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్‌ చేశారు. శిథిలాల కింద చిక్కిన వాళ్లను కాపాడేందుకు సహాయ చర్యలను వేగవంతం చేయాలన్నారు. ఆయన వెంట సీఐటీయూ జిల్లా నాయకులు కె.రాజయ్య, అతిమేల మాణిక్‌, రాజు ఉన్నారు.